## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు మండలంలోని మోదుకూరు, వేటపాలెం, కొత్తపల్లి, నారికేలపల్లి గ్రామాలలో, చుండూరు ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

### సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

**సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్**




రేపల్లె: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ హెచ్చరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో నాయకుడు శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత పది సంవత్సరాల నుంచి పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు పెరగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జీవో 36 ప్రకారం పనికి తగ్గ వేతనం ఇవ్వాల్సి ఉన్నా పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే అత్యవసర సేవలను నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.ప్రభాకరరావు, ఎస్.రవి, కె.రాఘవేంద్రరావు, శివ, సుబ్బారావు, శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరుగుతున్న సమ్మెకు ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు.

### భవిత కేంద్రం బాలబాలికలకు పరికరాలు పంపిణీ




వేమూరు: బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బాలబాలికలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో చదువుతున్న బాలబాలికలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని తెలిపారు. భవిత కేంద్రం బాలబాలికలకు ఉచిత పాఠ్య పుస్తకాలు, బట్టలు, బ్యాగులు, అలివెన్స్‌లు, ఉపకరణాలు అందించడం జరుగుతుందన్నారు. బాలబాలికలు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో బాగా చదువుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, మోహన్‌రాజు, విజయలక్ష్మి, బాలబాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పెసర్లంక జెడ్పీ పాఠశాల విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు



పెసర్లంక(భట్టిప్రోలు): మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన గుంటూరు పూజిత రెండవ కోటాలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ పాఠశాలలో పూజితతో కలిపి మొత్తం 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అంబటి జాకబ్ మంగళవారం తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా ఆంగ్ల ఉపాధ్యాయులు వి.వెంకటేశ్వరరావు, వి.పరమేశ్వరరావులు పూజితను అభినందించి రూ.3,500 విలువ కలిగిన సూట్‌కేస్, సర్టిఫికెట్ ఫైల్స్‌ను అందజేశారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన పూజితను ఎంఈవో నీలం దేవరాజ్ అభినందించారు.

### ద్విచక్ర వాహనం లారీ ఢీ కొని వ్యక్తికి గాయాలు



రెడ్డిపాలెం(కర్లపాలెం): ద్విచక్ర వాహనంను లారీ ఢీ కొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన పిట్టలవానిపాలెం మండలం రెడ్డిపాలెం సెంటర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. చందోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు రేపల్లెకు చెందిన నీలా వెంకటస్వామి ద్విచక్ర వాహనంపై బాపట్ల వస్తుండగా పిట్టలవానిపాలెం మండల పరిధిలోని రెడ్డిపాలెం సెంటర్ టర్నింగ్‌లో లారీ ఢీ కొనటంతో వెంకటస్వామికి తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని చందోలు పోలీసులు వివరించారు.

# వాణిజ్య పంటల సాగులో ఆటుపోట్లు

**రైతన్నలను వెన్నాడుతున్న వరద భయం**



కొల్లూరు మండలం చింతర్లంక సమీపంలో పసుపు విత్తనం నాటుతున్న వ్యవసాయ కూలీలు

కొల్లూరు: కృష్ణా నదీ పరివాహక గ్రామాలలో ఉద్యాన వన పంటల సాగు చేసే రైతుల పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా మారింది. ఏటా వరదల రూపంలో కృష్ణమ్మ పంట పొలాలను ముంచెత్తి రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీస్తుండటంతో వరద భయం వెంటాడుతుంది. వరదలకు తోడు ప్రకృతి వైపరీత్యాల రూపంలో పెనుగాలులతో కూడుకున్న వర్షాలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎదుగుదల లేక ఏర్పడుతున్న నష్టాలు రైతాంగాన్ని కలవరపాటుకు గురి చేస్తున్నాయి.

- కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సుమారు 17 వేల ఎకరాల విస్తీర్ణంలో అరటి, పసుపు, కంద, తమలపాకు, మొక్కజొన్న, బొప్పాయి, జామ వంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా లంక గ్రామాలలో సాగైన పంటలు సర్వం వరదార్పణం అవడంతో రైతాంగానికి పెట్టుబడులు సైతం దక్కక తీవ్ర నష్టం ఏర్పడింది. పసుపు, కంద, తమలపాకు, అరటి వంటి పంటలకు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులు వెచ్చిస్తున్న రైతాంగానికి వరదలు, గాలివానలు కారణంగా పంట నష్టం వాటిల్లుతుంది.

**పండిన పంటకు దక్కని మద్దతు ధర**

పంటలు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని సొమ్ము చేసుకునేందుకు రైతులకు సరైన మార్కెటింగ్ వసతులు కల్పించడంపై కూటమి ప్రభుత్వం విఫలమవడం రైతుల పాలిట శాపంగా మారింది. పసుపు దిగుబడులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దుగ్గిరాల మార్కెట్‌యార్డులో క్వింటాకు రూ.15 వేల నుంచి రూ.16 వేలు ధరలు లభించడంతో రైతులు లాభాలు చవిచూసారు. నేడు కూటమి ప్రభుత్వంలో పసుపు విత్తనం రేట్లు మండుతుండటంతో ఎకరానికి సరిపడా విత్తనానికి రూ.40 వేల వరకు రైతులు ఖర్చు చేయాల్సి వస్తుంది. వెన్నాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు, రైతాంగంపై కూటమి ప్రభుత్వ చిన్నచూపు ధోరణి ఫలితంగా ప్రస్తుతం వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులు పంట దిగుబడులు, చేతికందిన పంటకు గిట్టుబాటు ధరల లభ్యతపై గుబులు చెందుతున్నారు.

# సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడులు సాధించాలి

రేపల్లె: సస్యరక్షణ పద్ధతులను అవలంభించి సాగులో నాణ్యత విలువలతో కూడిన దిగుబడులు సాధించాలని వ్యవసాయ విస్తరణాధికారి రవి అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగడిపాలెం, రాజుకాల్వ రైతు సేవా కేంద్రాల పరిధిలోని సాగు భూములను మంగళవారం రైతులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వ్యవసాయ కార్యాలయంలో రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచటం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి, భూసారం శాతం, దుక్కులు దున్నటం, ఎరువుల వినియోగం వంటి అంశాలలో సందేహాలు కలిగితే వ్యవసాయ అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందేందుకు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఏరువాక బాపట్ల కేంద్రం అధికారి డాక్టర్ ఉష మాట్లాడుతూ భూసారాన్ని బట్టి ఎరువుల వినియోగం చేయాలన్నారు. పశువుల వ్యర్థాలు, సేంద్రియ ఎరువులు వినియోగించి కాలుష్యం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు నవీన్, సతీష్, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలి**

అమర్తలూరు(వేమూరు): వెద సాగులో ప్రధానంగా కలుపు యాజమాన్య పద్ధతుల గురించి మండల వ్యవసాయాధికారి హేమంత్ భరత్ వివరించారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులందరు త్వరితగతిన కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. పీఎంఎఫ్‌బీవై ద్వారా వరి పంటకు ఎకరానికి రూ.800 చెల్లించాలన్నారు. క్రాప్ రుణాలు పొందే రైతులకు బ్యాంక్ ద్వారా ప్రీమియం చెల్లింపు జరుగుతుందని చెప్పారు. కౌలు రైతులు మీ సేవా కేంద్రం ద్వారా చెల్లించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి డి.మాధవి, రైతులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం**

వేమూరు: కౌలు రైతులందరు కౌలు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు సక్రమంగా లేకపోవడంతో వెద సాగు చేసిన రైతులందరు వెద పొలాల్లో తేమ శాతం ఎక్కువగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



యలవర్రులో మాట్లాడుతున్న ఏవో హేమంత్ భరత్

**విత్తన శుద్ధి చేయాలి**

కర్లపాలెం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఏట్రావారిపాలెం, నల్లమోతువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయటం వలన పైర్లకు ఆశించే తెగుళ్లను నివారించగలుగుతామని చెప్పారు. విత్తన శుద్ధికి కిలో విత్తనాలకు ఒక గ్రాము బావిస్టిన్, లేదా ఒక గ్రాము సోడోమోనస్ కలపాలని తెలిపారు. ఖరీఫ్ వరి సాగుకు రైతులు బీపీటీ 2782, 2846 లేదా ఎంటీయూ 1318, 1232, 1262 రకాలను ఎంచుకోవాలని సూచించారు. వేరుశనగ పైరు ఊడలు దిగే సమయంలో ఎకరానికి 200 కేజీల జిప్సం వేయాలని దీని వలన విత్తనం సైజు పెరిగి పెంకు గట్టిగా ఏర్పడుతుందన్నారు. ఏట్రావారిపాలెం సర్పంచ్ వెంకటలక్ష్మి, ఏఈవో భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు దుర్గాభవానీ, రైతులు పాల్గొన్నారు.

**పంట నమోదుతో రైతులకు మేలు**

కొల్లూరు: ఖరీఫ్‌లో పంట సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.నరేంద్రబాబు అన్నారు. మంగళవారం మండలంలోని అనంతవరం, చిలుమూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పంట నమోదు చేయించని పక్షంలో ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టం వాటిల్లితే పరిహారం అందే అవకాశం ఉండదని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పొందడానికి, పంటలు విక్రయించుకోవడానికి పంట నమోదు రైతాంగానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా వెద సాగు చేసిన వరి రైతులకు కలుపు యాజమాన్యపు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.



జంపని గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ప్రేమ్‌సాగర్



మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్



రైతులకు సూచనలిస్తున్న ఏవో నరేంద్రబాబు

# శక్తి యాప్‌తోనే మహిళల భద్రత

**ఎస్ఐ అనిత**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అనిత

బాపట్లటౌన్: శక్తి యాప్‌తోనే మహిళల భద్రత సాధ్యమని ఎస్ఐ అనిత తెలిపారు. మంగళవారం బాపట్ల మండలంలోని కొండుబొట్లవారిపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ అనిత మాట్లాడుతూ మహిళల భద్రతకు శక్తి యాప్ ఎంతో కీలకమన్నారు. ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే పోలీసులు స్పందించి సహాయం అందిస్తారన్నారు. శక్తి వాట్సాప్ నంబర్ 7993485111 ద్వారా 24 గంటల పాటు మహిళలు, బాలికలు తమ సమస్యలను నేరుగా పోలీసులకు తెలియజేయవచ్చన్నారు. ఎవరి ప్రవర్తన వల్లనైనా అసౌకర్యాలకు గురైతే వెంటనే తల్లిదండ్రులు, గురువులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, మహిళలు, పిల్లలపై వేధింపులు గురించిన సమాచారం తెలిసిన వెంటనే 100, 112 వంటి అత్యవసర నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల హెడ్‌క్వార్టర్ శక్తి బృందం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన



పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో వెంకట రమణ

భట్టిప్రోలు: పీఎం సూర్య ఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.వెంకట రమణ పేర్కొన్నారు. మంగళవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో వెండర్లు, వెలుగు సిబ్బందికి పథకంపై అవగాహన కలిగించారు. ఎంపీడీవో రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రాయితీని ఉపయోగించుకుని సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకుంటే దాదాపు 20 సంవత్సరాలు విద్యుత్ బిల్లు కట్టాల్సిన పని లేదని అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, మాట్లాడుతూ యానిమేటర్లు ఈ పథకంపై మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. మండల సమాఖ్య సిబ్బంది, యానిమేటర్లు, సోలార్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కోవాలి



విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

తెనాలిరూరల్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని సమర్థంగా ఎదుర్కోవాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. రూరల్ గ్రామం కొలకలూరు బోసు బొమ్మ సెంటర్ పుర వేదికపై తాడేపల్లి ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఎన్డీఆర్ఎఫ్ బృందం గ్యాస్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తదితర అగ్ని ప్రమాదాల సమయంలో పాటించాల్సిన విధానాలను, గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించే విధానాన్ని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్డీఆర్ఎఫ్ బృందం నేర్పిన మెలకువలను విద్యార్థులు గుర్తించుకోవాలని, తల్లిదండ్రులకు కూడా తెలియజేయాలని కోరారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో యువత ముందుకుపోవాలి

**ప్రధానోపాధ్యాయులు సి.జయకుమార్**



సర్టిఫికెట్లతో విద్యార్థులు

బాపట్ల: ఆత్మవిశ్వసంతో యువత ముందుకు పోవాలని వెదుళ్లపల్లి హైస్కూలు ప్రధానోపాధ్యాయులు సి.జయకుమార్ పేర్కొన్నారు. జూలై 15న ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. నైపుణ్యాలపై విద్యార్థులకు ఇచ్చిన శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో నేర్చుకున్న చదువులకనుగుణంగా భవిష్యత్తును మలుచుకోవాలని సూచించారు.

## బంగారు కుటుంబాల గుర్తింపుకు గ్రామ సభలు



ఇంటూరు గ్రామ సభలో ఎంపీడీవో మారుతీ శేషాంబ

అమర్తలూరు(వేమూరు): బంగారు కుటుంబాలను సర్వే చేసేందుకు గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో మారుతీ శేషాంబ తెలిపారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి, బాపట్ల జిల్లా గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో 2,170 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇంటూరు గ్రామంలో 240 కుటుంబాలను గుర్తించారని, అధికారులు వారి ఇంటికి వెళ్లి సర్వే చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు ఎపుడు..?

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్**



అమర్తలూరు(వేమూరు): రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలు నెర వేరుస్తుందా? లేదా అర్థం కాని పరిస్థితి నెలకొందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 50 సంవత్సరాలు దాటిన మైనార్టీలకు పెన్షన్ అందిస్తామని చెప్పి అధికారం చేపట్టి ఏడాది దాటిన ఇంతవరకు మైనార్టీలకు పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా మార్గదర్శకాలు రూపొందించలేదని అన్నారు. పెన్షన్ వల్ల మైనార్టీలకు మేలు జరుగుతుందని, కూటమి ప్రభుత్వం 50 సంవత్సరాలు దాటిన మైనార్టీలకు పెన్షన్లు మంజూరు చేయకపోతే ఆందోళన చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆరు నెలలకు ఒకసారి పింఛన్లు మంజూరు చేసారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం దాటినా ఒక్క పింఛను కూడా ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మైనార్టీలకు అండగా ఉందని ఆయన చెప్పారు.

## నిబంధనలకు లోబడి మద్యం దుకాణాలు నిర్వహించాలి

**బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు**



పెట్రోలింగ్ యాప్‌పై సూచనలిస్తున్న బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు

నగరం: నిబంధనలకు లోబడి మాత్రమే మద్యం దుకాణాలను నిర్వహించుకోవాలని బాపట్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి బి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి అనంతరం సిబ్బంది, మద్యం దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మద్యం దుకాణంలో గానీ, చుట్టుపక్కల గానీ మద్యం తాగరాదన్నారు. అదే విధంగా దుకాణం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దుకాణాల వద్ద తెలుగులో రాయబడిన ధరల పట్టిక బ్యానర్‌లను, క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా అతికించి ఉంచాలన్నారు. దుకాణాలకు వచ్చే వారి చేత క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించాలని సూచించారు. దుకాణాల వద్ద వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు లేకుండా చూసుకోవాలని, సమయపాలన పాటించాలన్నారు. అధిక ధరలకు విక్రయాలు జరిపితే సహించేది లేదన్నారు. అక్రమ మద్యం తయారీ, రవాణా, అమ్మకాలు ఎక్కడైనా జరిగినట్లయితే 14405 నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి పెట్రోలింగ్ యాప్‌పై అవగాహన కల్పించి రికార్డులను పరిశీలించారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా తిరుపతి వెంకయ్య



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినవెంకయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు: సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా పెసర్లంకకు చెందిన గళ్లా తిరుపతి వెంకయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం మండలంలోని పెసర్లంకలో జరిగిన కార్యక్రమంలో భాగంగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమక్షంలో గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా తిరుపతి వెంకయ్య, డైరెక్టర్‌లుగా కోగంటి వెంకటరామారావు, సుగ్గున వెంకటేశ్వరరావులు బాధ్యతలు స్వీకరించారు. తొలుత సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్‌ప్రసాద్, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పరంజ్యోతి అమ్మ భగవాన్ మందిరంలో శాకంబరి అలంకారం



భట్టిప్రోలు: పరంజ్యోతి అమ్మ భగవాన్ మందిరంలో ఆషాడ మాసం పురస్కరించుకుని మంగళవారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూరేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తాతావారిపాలెం భజన భక్త సమాజం ఆధ్వర్యంలో సంకీర్తనలు చేశారు.